www.eenadupratibha.net

# BOARD OF SECONDARY EDUCATION (TELANGANA)

## SUMMATIVE ASSESSMENT – I

## TENTH CLASS SOCIAL STUDIES MODEL PAPER

### PAPER – I (TELUGU VERSION)

సమయం: 2 గం.45 ని. పార్టు – A & B గరిష్ఠ మార్కులు: 40

సూచన: మీకు ఇచ్చిన 2 గంటల 45 నిమిషాల సమయంలో 15 నిమిషాల సమయం ప్రశ్నపత్రం చదివి అవగాహన చేసుకోవడానికి, 2.30 గంటలు జవాబులు రాయడానికి కేటాయించారు.

సమయం: 2 గం.15 ని. పార్టు – A గరిష్ఠ మార్కులు: 35

### సెక్షన్ – I

సూచనలు:

i) అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

ii) ప్రతి ప్రశ్నకు ఒక మార్కు.

iii) ప్రతి ప్రశ్నకు 1 – 2 వాక్యాల్లో సమాధానాలు రాయండి. $7 \times 1 = 7$

1. మన జీవితంలో ఆదాయం కంటే ముఖ్యమైన ఇతర అంశాలకు కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.
2. 'భూగర్భజలాల చట్టాలు పాతబడి పోయాయి, ప్రస్తుత కాలానికి తగవు' వివరించండి.
3. పశ్చిమాన ఉన్న గుజరాత్‌లో కంటే అరుణాచల్‌ప్రదేశ్‌లో సూర్యోదయం రెండు గంటల ముందు అవుతుంది. కానీ గడియారాలు ఒకే సమయం చూపిస్తాయి. ఎందుకు?

**వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల పాత్ర**

| రంగం | వాటా (మొత్తంలో శాతం) | |
|---|---|---|
| | ఉపాధి | స్థూలదేశీయ ఉత్పత్తి |
| వ్యవస్థీకృత | 8 | 50 |
| అవ్యవస్థీకృత | 92 | 50 |
| **మొత్తం** | **100** | **100** |

పై పట్టికను చదివి 4, 5 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.

4. ఏ రంగంలో తక్కువ మంది ఉపాధి పొందుతున్నారు?
5. ఉత్పత్తి పెరిగినా, దానికి తగినట్లుగా ఉపాధి పెరగని రంగం ఏది?
6. రుతుపవనాలు నావికులకు ఏ విధంగా సహాయపడుతున్నాయి?
7. పెనుతుపానులు, వరదలు వచ్చినప్పుడు అక్కడి ప్రజలు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటారు?

www.eenadupratibha.net

## సెక్షన్ – II

సూచనలు:

i) అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

ii) ప్రతి ప్రశ్నకు 2 మార్కులు.

iii) ప్రతి ప్రశ్నకు 4 – 5 వాక్యాల్లో సమాధానం రాయండి. $6 \times 2 = 12$

8. 'సేవారంగం ఇతర రంగాల కంటే భిన్నమైంది'. ఎందుకు?

9. గంగా, సింధు నదుల మైదానంలో జనసాంద్రత ఎక్కువ. కారణాలు తెలపండి.

10. భారతదేశం చిత్తు పటాన్ని గీసి, అందులో తెలంగాణా రాష్ట్రాన్ని చూపండి.

11. నదులు మానవ జీవితానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి?

12. కింది పట్టికను పరిశీలించి, ప్రశ్నలకు జవాబులు రాయండి.

**కొన్ని రాష్ట్రాలకు సంబంధించి కొన్ని తులనాత్మక గణాంకాలు**

| రాష్ట్రం | శిశుమరణాలు వెయ్యికి (2006) | అక్షరాస్యత శాతం (2011) | నికర హాజరు శాతం (2006) |
|---|---|---|---|
| పంజాబ్ | 42 | 77 | 76 |
| హిమాచల్ ప్రదేశ్ | 36 | 84 | 90 |
| బీహార్ | 62 | 64 | 56 |

ప్రశ్నలు:

1. 'శిశుమరణాల రేటు' అంటే ఏమిటి?

2. పై పట్టిక ఆధారంగా వెనుకబడి ఉన్న రాష్ట్రం ఏది?

13. ఇచ్చిన 'పై' చార్టును చూసి, కింది పట్టికను నింపండి.

**మూడు రంగాల్లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వాటా**




www.eenadupratibha.net

| రంగం | స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)% | |
|---|---|---|
| | 1972 – 73 | 2009 – 10 |
| వ్యవసాయం | | |
| పరిశ్రమలు | | |
| సేవలు | | |
| మొత్తం | | |

## సెక్షన్ – III

సూచనలు:

i) అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

ii) ప్రతి ప్రశ్నకు 4 మార్కులు.

iii) ప్రతి ప్రశ్నకు అంతర్గత వెసులుబాటు ఉంటుంది.

iv) ప్రతి ప్రశ్నకు 8 – 10 వాక్యాల్లో సమాధానం రాయండి. $4 \times 4 = 16$

14. హిమాలయాలు భారతదేశ శీతోష్ణస్థితిని తద్వారా భారతదేశ వ్యవసాయాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో వివరించండి.

(లేదా)

భారతదేశ శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలేవి?

15. "వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగాలను అందరూ కోరుకుంటారు. కానీ ఈ రంగంలోని ఉపాధి అవకాశాలు చాలా నిదానంగా పెరుగుతున్నాయి. ఫలితంగా అధికశాతం మందికి అవ్యవస్థీకృత రంగంలో ఉద్యోగాలు తప్పించి మరోదారి లేదు".

ప్రశ్న: అవ్యవస్థీకృత రంగం కంటే వ్యవస్థీకృత రంగం మెరుగైంది అని అనుకుంటున్నారా. మీ అభిప్రాయం తెలపండి.

(లేదా)

"భారతదేశంలో దక్షిణాది ప్రాంతం భూమధ్యరేఖకు దగ్గరగా ఉష్ణమండలంలో ఉంది. ఉత్తర ప్రాంతం కంటే దక్షిణ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. కన్యాకుమారిలోని శీతోష్ణస్థితి దిల్లీ శీతోష్ణస్థితి కంటే భిన్నంగా ఉంటుంది".

ప్రశ్న: భారతదేశంలో దక్షిణ ప్రాంతం కంటే ఉత్తరాన వేడిమి తక్కువగా ఉంటుంది. వ్యాఖ్యానించండి.

16. "భారతదేశంలో స్త్రీల పట్ల వివక్ష దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది" అని అనడానికి ఉన్న ఆధారాలు రాయండి.

(లేదా)

ఈ మధ్యకాలంలో చాలా ప్రాంతాల్లో అనేక సందర్భాల్లో నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందని మీరు భావిస్తున్నారు?

www.eenadupratibha.net

**17.** మీకు ఇచ్చిన భారతదేశ పటంలో కిందివాటిని గుర్తించండి.

1. మహారాష్ట్ర
2. ఆరావళి
3. లక్షద్వీప దీవులు
4. మాళ్వా పీఠభూమి

**(లేదా)**

1. గోదావరి
2. కాంచన గంగ
3. హిమాచల్ ప్రదేశ్
4. భారత ఎడారి

www.eenadupratibha.net
www.eenadupratibha.net

సమయం: 30 నిమిషాలు | పార్టు – B | మార్కులు: 5

సూచనలు:

i) అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

ii) ప్రతి ప్రశ్నకు $\frac{1}{2}$ మార్కు.

iii) ప్రతి ప్రశ్నకు ఇచ్చిన నాలుగు సమాధానాల్లో సరైన సమాధానాన్ని ఎన్నుకుని, దాన్ని సూచించే ఆంగ్ల అక్షరాన్ని **(A, B, C, D)** బ్రాకెట్లలో పెద్ద అక్షరంతో రాయండి.

iv) దిద్దిన, చెరిపివేసి రాసిన సమాధానాలకు మార్కులు ఇవ్వరు. $10 \times \frac{1}{2} = 5$

## సెక్షన్ – IV

**18.** మేలో కూడా చల్లటి వాతావరణం ఉండే ప్రదేశాలు- ( )

I) సిమ్లా II) ముంబయి III) డెహ్రాడూన్ IV) కోల్‌కత

A) I, II B) III, IV C) I, III D) I, IV

**19.** కిందివాటిలో సరైంది- ( )

1. భారతదేశ ఆయుఃప్రమాణం 65.8 సంవత్సరాలు

2. పాకిస్థాన్ ఆయుఃప్రమాణం 65.7 సంవత్సరాలు

A) 1, 2 సరైనవి B) 1 మాత్రమే సరైంది

C) 2 మాత్రమే సరైంది D) రెండూ సరైనవి కావు

**20.** కిందివాటిలో అవ్యవస్థీకృత రంగానికి చెందినవి ( )

A) బ్యాంకులు B) ప్రభుత్వ పాఠశాలలు

C) రైల్వేలు D) చిన్నరైతు వ్యవసాయం

**21.** తూర్పు కనుమల్లో భాగం కానిది ( )

A) నల్లమల కొండలు B) కార్డమమ్ కొండలు

C) శేషాచలం కొండలు D) పాలకొండలు

**22.** భూగర్భజలాల పునరుద్ధరణకు అవకాశం లేకుండా ఉండటానికి కారణం ( )

A) చెట్లు నరకడం B) పరిశ్రమలు స్థాపించడం

C) వ్యవసాయం చేయడం D) ఏదీకాదు

**23.** అతితక్కువ తలసరి ఆదాయం దేశం ( )

A) శ్రీలంక B) నేపాల్ C) పాకిస్థాన్ D) భారతదేశం

**24.** కింది ఏ రాష్ట్రాలు తుంగభద్ర నదీజలాలను ఉపయోగించుకుంటున్నాయి? ( )

A) తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ

B) తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్

C) మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

D) కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

www.eenadupratibha.net

**25.** అగ్నిపర్వతాల వల్ల ఏర్పడిన దీవులు- ( )

A) శ్రీలంక, లక్షద్వీప దీవులు
B) శ్రీలంక, బారెన్ దీవి
C) శ్రీలంక, నార్కొండాం దీవి
D) నార్కొండాం, బారెన్ దీవి

**26.** వసంత రుతువులో వచ్చే తెలుగు నెలలు ( )

A) శ్రావణం – భాద్రపదం
B) చైత్రం – వైశాఖం
C) జ్యేష్ఠం – ఆషాడం
D) ఆశ్వయుజం – కార్తీకం

**27.** పశ్చిమంగా ప్రవహించి, ఆరేబియా సముద్రంలో కలిసే నదులు ( )

A) నర్మద, గోదావరి
B) కృష్ణా, నర్మద
C) నర్మద, తపతి
D) గోదావరి, తపతి

www.eenadupratibha.net
www.eenadupratibha.net

# జవాబులు

## పార్టు - A

### సెక్షన్ - I

**1. మన జీవితంలో ఆదాయం కంటే ముఖ్యమైన ఇతర అంశాలకు కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.**

జ: సమానత, స్వేచ్ఛ, భద్రత, ఇతరుల నుంచి గౌరవం, అభిమానాన్ని పొందడం; స్నేహాన్ని కోరుకోవడం మన జీవితంలో ఆదాయం కంటే ముఖ్యమైన ఇతర అంశాలుగా చెప్పవచ్చు.

**2. 'భూగర్భజలాల చట్టాలు పాతబడి పోయాయి, ప్రస్తుత కాలానికి తగవు'. వివరించండి.**

జ: భూగర్భ జలాల చట్టాలు పాతబడి పోయాయి అన్నది వాస్తవం. అవి బ్రిటిష్ కాలం నాటివి. అప్పటి పరిస్థితులకు, ఇప్పటి పరిస్థితులకు నీటి వినియోగంలో చాలా మార్పులు వచ్చాయి. కాబట్టి ప్రస్తుత కాలానికి అవి తగవు.

**3. పశ్చిమాన ఉన్న గుజరాత్‌లో కంటే అరుణాచల్‌ప్రదేశ్‌లో సూర్యోదయం రెండు గంటల ముందు అవుతుంది. కానీ గడియారాలు ఒకే సమయం చూపిస్తాయి. ఎందుకు?**

జ: భారతదేశ ప్రామాణిక రేఖాంశంగా 82° 30' తూర్పు రేఖాంశాన్ని తీసుకున్నారు. దీని వద్దే భారతదేశ కాలాన్ని లెక్కిస్తారు. కాబట్టే గుజరాత్‌లో కంటే, అరుణాచల్‌ప్రదేశ్‌లో సూర్యోదయం రెండు గంటలు ముందు అయినా, గడియారాలు ఒకే సమయాన్ని చూపిస్తాయి.

**వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల పాత్ర**

| రంగం | వాటా (మొత్తంలో శాతం) | |
|---|---|---|
| | ఉపాధి | స్థూలదేశీయ ఉత్పత్తి |
| వ్యవస్థీకృత | 8 | 50 |
| అవ్యవస్థీకృత | 92 | 50 |
| **మొత్తం** | **100** | **100** |

పై పట్టికను చదివి 4, 5 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.

**4. ఏ రంగంలో తక్కువ మంది ఉపాధి పొందుతున్నారు?**

జ: వ్యవస్థీకృత రంగంలో తక్కువ మంది ఉపాధి పొందుతున్నారు.

**5. ఉత్పత్తి పెరిగినా, దానికి తగినట్లుగా ఉపాధి పెరగని రంగం ఏది?**

జ: ఉత్పత్తి పెరిగినా, దానికి తగినట్లుగా ఉపాధి పెరగని రంగం వ్యవస్థీకృత రంగం.

**6. రుతుపవనాలు నావికులకు ఏ విధంగా సహాయపడుతున్నాయి?**

జ: ★ భారతదేశానికి వచ్చిన నావికులు గాలులు వీచే దిశ క్రమం తప్పకుండా మారుతుండటాన్ని గమనించారు. ఈ గాలుల సహాయంతోనే వారు భారతదేశ తీరం వైపునకు ప్రయాణించేవారు.

**7. పెనుతుపానులు, వరదలు వచ్చినప్పుడు అక్కడి ప్రజలు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటారు?**

జ: ★ సర్వస్వం కోల్పోతారు

★ ప్రాణనష్టం జరగవచ్చు

★ ఆహారానికి, నీటికి ఇబ్బంది పడతారు

★ రోగాల బారిన పడతారు

## సెక్షన్ – II

**8. 'సేవారంగం ఇతర రంగాల కంటే భిన్నమైంది'. ఎందుకు?**

జ: సేవారంగం (తృతీయ రంగం) ఇతర రంగాల కంటే భిన్నమైంది.

**ఎందుకంటే......**

★ గత 50 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశాల్లో సేవల రంగానికి లభించే ప్రాధాన్యం మారుతూ వస్తోంది.

★ మొత్తం ఉత్పత్తిలో సేవారంగం ప్రముఖ స్థానంలో ఉంది.

★ మిగతా రెండు రంగాల కంటే ఇది అతిపెద్ద రంగంగా అభివృద్ధి చెందుతోంది.

★ సేవారంగం ఇతర రంగాల అభివృద్ధికి పరిపూరక రంగంగా పనిచేస్తుంది.

★ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ, పరిశ్రమల రంగాలు పుష్టినిస్తే సేవారంగం దాన్ని ఆధునికీకరిస్తుంది.

**9. గంగా, సింధూ నదుల మైదానంలో జనసాంద్రత ఎక్కువ. కారణాలు తెలపండి.**

జ: ఎక్కడైతే జీవించడానికి అనుకూలంగా ఉంటుందో అక్కడే మానవుడు నివాసం ఉండటానికి ఇష్టపడతాడు. నాగరికతలన్నీ నదీతీర ప్రాంతాల్లోనే బయల్పడ్డాయి.

★ సారవంతమైన ఒండ్రు నేలలు ఉండటం

★ తాగునీరు, సాగునీరుకు అనుకూలంగా ఉండటం

★ పరిశ్రమల నిర్మాణానికి అనువుగా ఉండటం

★ రవాణా సౌకర్యాలుండటం

★ వ్యవసాయం, పరిశ్రమలు నెలకొల్పడం వల్ల ఉపాధి కోసం ప్రజలు ఒకేచోటకు చేరడం.

★ మైదాన ప్రాంతాలు బాగా అభివృద్ధి చెంది, నగరాలుగా ఏర్పడటం వల్ల గంగా, సింధూ నదుల మైదానంలో జనసాంద్రత ఎక్కువగా ఉంది.

**10. భారతదేశం చిత్తు పటాన్ని గీసి, అందులో తెలంగాణా రాష్ట్రాన్ని చూపండి.**

జ:



**11.** నదులు మానవ జీవితానికి ఏవిధంగా ఉపయోగపడుతున్నాయి?

జ: నాగరికతలన్నీ నదీ పరీవాహక ప్రాంతాల్లోనే బయల్పడ్డాయి. పురాతన కాలం నుంచి నదులు మానవుడికి ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్నాయి.

★ తాగు, సాగునీటిని నదులు అందిస్తున్నాయి.

★ పరిశ్రమలకు ఉపయోగపడుతున్నాయి.

★ నీటి ద్వారా జల విద్యుచ్ఛక్తి లభిస్తుంది.

★ నదుల్లో దొరికే మత్స్య సంపద ఆహారంగా ఉపయోగపడటమే కాకుండా ఎంతోమందికి జీవనోపాధిని కలగచేస్తుంది.

★ రవాణామార్గంగా ఉపయోగపడుతున్నాయి.

★ సుందర ప్రదేశాలు ఏర్పడి, పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

**12.** కింది పట్టికను పరిశీలించి, ప్రశ్నలకు జవాబులు రాయండి.

**కొన్ని రాష్ట్రాలకు సంబంధించి కొన్ని తులనాత్మక గణాంకాలు**

| రాష్ట్రం | శిశుమరణాలు వెయ్యికి (2006) | అక్షరాస్యత శాతం (2011) | నికర హాజరు శాతం (2006) |
|---|---|---|---|
| పంజాబ్ | 42 | 77 | 76 |
| హిమాచల్ ప్రదేశ్ | 36 | 84 | 90 |
| బీహార్ | 62 | 64 | 56 |

ప్రశ్నలు:

**1. 'శిశుమరణాల రేటు' అంటే ఏమిటి?**

జ: సజీవంగా పుట్టిన ప్రతి వెయ్యి మంది పిల్లల్లో సంవత్సరం పూర్తి అయ్యేసరికి ఎంతమంది చనిపోతున్నారో తెలియజేసే సంఖ్యనే శిశుమరణాల రేటు అంటారు.

**2. పై పట్టిక ఆధారంగా వెనుకబడి ఉన్న రాష్ట్రం ఏది?**

జ: పై పట్టికను ఆధారంగా వెనుకబడిన రాష్ట్రం బీహార్.

**13.** ఇచ్చిన 'పై' చార్టును చూసి, కింది పట్టికను నింపండి.

**మూడు రంగాల్లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వాటా**



| రంగం | స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) % | |
|---|---|---|
| | **1972 – 73** | **2009 – 10** |
| వ్యవసాయం | | |
| పరిశ్రమలు | | |
| సేవలు | | |
| మొత్తం | | |

జ:

| రంగం | స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) % | |
|---|---|---|
| | **1972 – 73** | **2009 – 10** |
| వ్యవసాయం | 43 | 17 |
| పరిశ్రమలు | 22 | 26 |
| సేవలు | 35 | 57 |
| **మొత్తం** | **100** | **100** |

## సెక్షన్ – III

**14. హిమాలయాలు భారతదేశ శీతోష్ణస్థితిని తద్వారా భారతదేశ వ్యవసాయాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో వివరించండి.**

జ: హిమాలయ పర్వతాలు భారతదేశానికి ఉత్తరాన ఒక చాపం మాదిరిగా పడమర నుంచి తూర్పునకు 2400 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి. ఇవి మానవుడికి ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్నాయి.

★ శీతోష్ణస్థితి దృష్ట్యా చూస్తే, మధ్య ఆసియా నుంచి వీచే అతి శీతల పవనాలను భారతదేశంలోకి ప్రవేశించకుండా హిమాలయాలు అడ్డుకుంటున్నాయి. ఇవే లేనట్లయితే తీవ్ర చలిగాలుల వల్ల భారతీయులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారు.

★ వేసవిలో కురిసే వర్షాలకు, పశ్చిమ కనుమలు దాటిన తర్వాత ఉన్న రుతుపవన తరహా శీతోష్ణస్థితికి హిమాలయాలే కారణం.

★ ఈ పర్వతాలు లేకపోతే ఉత్తర ప్రాంతం పొడిగా ఉండి, ఉష్ణమండల ఎడారిగా మారేది.

★ హిమాలయాల్లోని హిమానీనదాల నుంచి ప్రవహించే జీవనదులు ఏర్పడి ఉండేవి కావు.

★ వ్యవసాయ పరంగా చూస్తే, హిమాలయాల వల్ల ఏర్పడిన జీవనదులు సంవత్సరం పొడవునా నీళ్లు కలిగి ఉండి, అన్ని పంటకాలల్లోనూ నీటిని సమృద్ధిగా అందిస్తున్నాయి.

★ ఈ నదులు కొండల నుంచి కిందికి తెచ్చే ఒండ్రు మట్టి వల్ల మైదాన ప్రాంతాలు చాలా సారవంతంగా మారాయి.

★ విలువైన అటవీ సంపద లభిస్తుంది.

★ అక్కడ దొరికే వివిధ రకాల మూలికల ద్వారా ఔషధ పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది.

ఈ విధంగా హిమాలయాలు భారతదేశ శీతోష్ణస్థితిని, వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

(లేదా)

**భారతదేశ శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలేవి?**

జ: **భారతదేశ శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలు 4.**

**అవి:** 1) అక్షాంశం

2) భూమికి – నీటికి మధ్య సంబంధం

3) భౌగోళిక స్వరూపం

4) వాతావరణంలో ఉపరితల గాలి ప్రసరణ

**1) అక్షాంశం:**

★ ఒక ప్రదేశం ఉష్ణోగ్రత ఆ ప్రదేశ అక్షాంశంపై ఆధారపడి ఉంటుంది. ఉన్నత అక్షాంశాల కంటే నిమ్న అక్షాంశాల వద్ద ఉష్ణోగ్రత ఎక్కువ.

★ దక్షిణ భారతదేశం భూమధ్యరేఖకు దగ్గరగా ఉష్ణమండలంలో ఉన్నందున ఉత్తర భారతదేశం కంటే అధిక ఉష్ణోగ్రతను కలిగి ఉంటుంది.

**2) భూమికి – నీటికి మధ్య సంబంధం:**

★ భూభాగంతో పోలిస్తే, జలప్రాంతాలు నిదానంగా వేడెక్కి నిదానంగా చల్లబడతాయి.

★ ఈ కారణంగా భూ, సముద్రపవనాలు ఏర్పడి తీరప్రాంత శీతోష్ణస్థితిని ప్రభావితం చేస్తాయి.

**3) భౌగోళిక స్వరూపం:**

★ భౌగోళిక స్వరూపం లేదా ఎత్తు, ఒక ప్రదేశం శీతోష్ణస్థితిని ప్రభావితం చేస్తుంది.

★ ఈ కారణంగా ఎత్తయిన ప్రాంతాలు వేసవిలో కూడా తక్కువ ఉష్ణోగ్రతను కలిగి వేసవి విడిది కేంద్రాలుగా ఉన్నాయి.

**ఉదా:** సిమ్లా, నైనిటాల్, ముస్సోరి.

**4) వాతావరణంలో ఉపరితల గాలి ప్రసరణ:**

★ అత్యంత వేగంగా వీచే ఉపరితల వాయు ప్రవాహాలను **జెట్ స్ట్రీమ్స్** అంటారు.

★ ఈ జెట్ ప్రవాహం వల్ల చుట్టూ ఉన్న ఉష్ణోగ్రత చల్లబడుతుంది.

15. **"వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగాలను అందరూ కోరుకుంటారు. కానీ ఈ రంగంలోని ఉపాధి అవకాశాలు చాలా నిదానంగా పెరుగుతున్నాయి. ఫలితంగా అధికశాతం మందికి అవ్యవస్థీకృత రంగంలో ఉద్యోగాలు తప్పించి మరోదారి లేదు".**

ప్రశ్న: **అవ్యవస్థీకృత రంగం కంటే వ్యవస్థీకృత రంగం మెరుగైంది అని అనుకుంటున్నారా. మీ అభిప్రాయం తెలపండి.**

జ: అవవ్యస్థీకృత రంగం కంటే వ్యవస్థీకృత రంగం మెరుగైందని నేను అనుకుంటున్నాను. ఎందుకంటే...

★ వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగాలు ప్రభుత్వం వద్ద నమోదు చేసుకుని ఉంటాయి. అందువల్ల కర్మాగారాల చట్టం, కనీస వేతన చట్టం, దుకాణాలు, సంస్థల చట్టం లాంటి వాటిలో ఉన్న ప్రభుత్వ నియమ నిబంధనలను ఇవి అనుసరిస్తాయి. అవ్యవస్థీకృత రంగంలో ఉద్యోగాలు సాధారణంగా ప్రభుత్వ నియంత్రణలో ఉండవు.

★ వ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంటుంది. అవవ్యస్థీకృత రంగంలో ఉద్యోగులకు జీతం తక్కువ, భద్రత కూడా ఉండదు.

★ నిర్ధారిత గంటల పని, అంతకంటే ఎక్కువ పనిచేస్తే అదనపు వేతనం, జీతంతో కూడిన సెలవు, భవిష్యనిధి లాంటి ప్రయోజనాలు వ్యవస్థీకృత రంగంలో ఉండగా, అవ్యవస్థీకృత రంగంలో ఇవేమీ ఉండవు.

★ తరచూ దోపిడీకి గురవుతూ, న్యాయమైన వేతనం పొందలేక అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులు సతమతమవుతూ ఉంటారు.

★ ఇన్ని మెరుగైన అవకాశాలు వ్యవస్థీకృత రంగంలో ఉన్నాయి అందుకే అవ్యవస్థీకృత రంగం కంటే వ్యవస్థీకృత రంగమే మేలని నేను అభిప్రాయపడుతున్నాను.

**(లేదా)**

**"భారతదేశంలో దక్షిణాది ప్రాంతం భూమధ్యరేఖకు దగ్గరగా ఉష్ణమండలంలో ఉంది. ఉత్తర ప్రాంతం కంటే దక్షిణ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. కన్యాకుమారిలోని శీతోష్ణస్థితి దిల్లీ శీతోష్ణస్థితి కంటే భిన్నంగా ఉంటుంది".**

**ప్రశ్న: భారతదేశంలో దక్షిణ ప్రాంతం కంటే ఉత్తరాన వేడిమి తక్కువగా ఉంటుంది. వ్యాఖ్యానించండి.**

జ: శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాల్లో **అక్షాంశాలు** ప్రముఖపాత్ర వహిస్తున్నాయి. అక్షాంశాన్ని బట్టి ఉష్ణోగ్రత తీవ్రత ఆధారపడి ఉంటుంది. భూమధ్యరేఖ నుంచి దూరం పెరుగుతున్నకొద్దీ వార్షిక సగటు ఉష్ణోగ్రతలు తగ్గుతూ ఉంటాయి.

భూమి ఉపరితలంపైన ఉష్ణోగ్రత ఆ ప్రాంతంలో సూర్యకిరణాల నుంచి వచ్చే వేడిమి (సూర్య పుటం) మీద ఆధారపడి ఉంటుంది. భూమధ్యరేఖకు దూరంగా ఉన్న అక్షాంశాల వద్ద కంటే, దగ్గరగా ఉన్న అక్షాంశాల వద్ద వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

భారతదేశం సుమారుగా $8^\circ - 37^\circ$ ఉత్తర అక్షాంశాల మధ్య ఉంది. భూమధ్యరేఖ నుంచి దూరం వెళ్లే కొద్దీ వేడిమి తగ్గుతుంది. కాబట్టి భారతదేశంలో $8^\circ$ ఉత్తర అక్షాంశం దగ్గర ఉన్న ప్రాంతాల వద్ద కంటే, $37^\circ$ ఉత్తర అక్షాంశం దగ్గర ఉన్న ప్రాంతాల వద్ద వేడి తక్కువగా ఉంటుంది.

అందుకే భారతదేశంలో దక్షిణ ప్రాంతం కంటే, ఉత్తరాన వేడిమి తక్కువగా ఉంటుంది.

**16. "భారతదేశంలో స్త్రీల పట్ల వివక్ష దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది" అని అనడానికి ఉన్న ఆధారాలు రాయండి.**

జ: ఈనాటికీ భారతదేశంలోని స్త్రీలు వివక్షకు గురవుతూనే ఉన్నారని కచ్చితంగా చెప్పవచ్చు.

★ జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో ప్రతి వందమంది మగ పిల్లలకు 103 మంది ఆడపిల్లలు పుడుతున్నారు. కానీ మగపిల్లల కంటే ఎక్కువ మంది ఆడపిల్లలు చనిపోతున్నారు. 0 – 5 వయస్సున్న పిల్లల్లో మగపిల్లల సంఖ్య కంటే ఆడపిల్లల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది.

★ మగ పిల్లవాడే కావాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

★ పుత్రుడు పుట్టాలనే కోరికతో తల్లిదండ్రులు ముందుగానే లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి. గర్భంలో ఉన్నది ఏ శిశువో తెలుసుకుని ఆడబిడ్డ అయితే భ్రూణహత్యకు పాల్పడుతున్నారు.

★ చాలా కుటుంబాలు ఆడపిల్లలను భారంగా భావిస్తున్నాయి.

★ వరకట్న వేధింపులకు ఆడపడుచులు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

★ మగ పిల్లలకు ఇస్తున్న ప్రాధాన్యం ఆడపిల్లలకు ఇవ్వడం లేదు.

★ వైద్యంలోనూ లింగ వివక్ష ఆడపిల్లల మరణానికి దారితీస్తుంది.

★ మగపిల్లలకు ఇచ్చే శ్రద్ధాశక్తులతో పోలిస్తే, ఆడపిల్లల ఆరోగ్యం, విద్య, జబ్బుల గురించి పట్టించుకోవడం లేదు.

★ నిర్భయ చట్టం వచ్చినా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, వేధింపులు తగ్గడం లేదు.

ఈ ఆధారాల కారణంగా మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉందని చెప్పవచ్చు.

**(లేదా)**

**ప్ర: ఈ మధ్యకాలంలో చాలా ప్రాంతాల్లో అనేక సందర్భాల్లో నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందని మీరు భావిస్తున్నారు?**

జ: అర్థశాస్త్రంలో నీటిని ఉచిత వనరుగా చెప్పుకొనే వాళ్లం. ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. నీటిని ఆర్థిక వనరుగా చెప్పుకోవాల్సిందే. రెండో ప్రపంచ యుద్ధం ఎందుకు వచ్చిందంటే... పోలెండ్‌పై హిట్లర్ దురాక్రమణ చేయడం అని చెబుతాం. మూడో ప్రపంచ యుద్ధం ఏ కారణం వల్ల సంభవించవచ్చు అని అనుకుంటే, నీటికోసమే రావొచ్చు అని నిపుణులు అంటున్నారు. ఇలా ఎందుకన్నారో చూద్దాం.

★ ప్రపంచంలో పెరుగుతున్న జనాభాకు సరిపడా శుభ్రమైన నీరు లేదు.

★ భారతదేశంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతూ ఉంది.

★ మానవుడి తప్పిదాల వల్ల నీరు కలుషితమవుతుంది.

★ ప్రపంచంలో కలుషిత నీటి వల్ల ఏటా 50 లక్షల మందికి పైగా చనిపోతున్నారని అంచనా.

★ మనకు లభిస్తున్న నీటిలో స్వచ్ఛమైంది, మానవుడికి అవసరమైంది ఒక శాతం మాత్రమే ఉంది.

★ వర్షాభావం, ప్లాస్టిక్ వాడకం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

★ ఇలా నీటి కొరత, నీరు కలుషితమవడం, ప్రయివేటు కంపెనీలు అందించే నీళ్లు సులభతరంగా రవాణా చేయడం, సౌలభ్యం ఉన్న కారణంగా ప్రజలు నీటిని కొనుగోలు చేస్తున్నారు.

**17. మీకు ఇచ్చిన భారతదేశ పటంలో కిందివాటిని గుర్తించండి.**

1. మహారాష్ట్ర
2. ఆరావళి
3. లక్షద్వీప దీవులు
4. మాళ్వా పీఠభూమి

జ:




www.eenadupratibha.net

www.eenadupratibha.net

(లేదా)

మీకు ఇచ్చిన భారతదేశ పటంలో కిందివాటిని గుర్తించండి.

1. గోదావరి
2. కాంచన గంగ
3. హిమాచల్ ప్రదేశ్
4. భారత ఎడారి

జ:




## పార్టు – B

**జవాబులు**

**18-C; 19-A; 20-D; 21-B; 22-A; 23-B; 24-D; 25-D; 26-B; 27-C.**

రచయిత: బొమ్మిడి నారాయణరావు

www.eenadupratibha.net